www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily | ఆదివారం 13, సెప్టెంబర్, 2026

## నాలుగేళ్ల నిరీక్షణ

# దరి చేరదా చేయూత



- కొత్త పెన్షన్‌ల మంజూరీ పై క్యాటగిరి ఎఫెక్ట్
- 57ఏళ్ళు దాటిన వారికి నో ఛాన్స్
- ఆమడ దూరంలో ఆసరా

కొత్తగూడెం, సెప్టెంబర్ 12 (భద్రాద్రి న్యూస్):

2వ పేజీలో...

పింఛన్ కోసం నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న వృద్ధుల ఆశలపై మరోసారి నీళ్లు చల్లినట్లయింది. వృద్ధాప్యంలో తమకు ఆసరాగా నిలుస్తుందని భావించిన 'చేయూత' పథకం.. అర్హత వయసు దాటిన వారి విషయంలో మాత్రం అందని ద్రాక్షగా మారిందన్న ఆవేదన వ్యక్తమవుతోంది. కొత్త పెన్షన్ల మంజూరుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఆశలు చిగురించినా.. దరఖాస్తుల స్వీకరణలో వృద్ధాప్య కేటగిరీకి అవకాశం లేకపోవడం తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఇతర కేటగిరీలకు దరఖాస్తులు స్వీకరిస్తున్న సమయంలో 57 ఏళ్లు దాటిన వృద్ధులకు..

# రాజీమార్గమే రాజమార్గం..

రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో రాజీ పడవచ్చు..

జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నాగరాజు

జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ లో 3 వ జాతీయ లోక్ అదాలత్ ను ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి




5లో

**ఖమ్మం ప్రతినిధి , (భద్రాద్రి న్యూస్):–** రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి, సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు తెలుపారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఖమ్మం న్యాయ సేవా సదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో 15 లోక్ అదాలత్ బెంచ్‌ల ఏర్పాటు చేసినట్లు, ఇందులో ఖమ్మం హెడ్ క్వార్టర్ లో 9, సత్తుపల్లిలో 3, మధిరలో 3 బెంచ్ లు ఉన్నాయని అన్నారు. ప్రజలకు వేగంగా, సమర్థవంతంగా న్యాయం అందించేందుకు..

# ప్రత్యేక ప్రచార దినాలను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి



5లో

**అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి**

**ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి**

**భద్రాద్రి న్యూస్ ములుగు**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినాలను అర్హులైన ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి సూచించారు. శనివారం ములుగు, మల్లంపల్లి, వెంకటాపురం మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల నమోదు అధికారి తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి ..

# నాలుగేళ్ల నిరీక్షణ.. దరి చేరదా చేయూత

**మొదటి పేజీ తరువాయి**

మాత్రం దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోవడంపై బాధితుల్లో అసంతృప్తి పెరుగుతోంది. 'పింఛన్ ఇస్తామన్నారు.. దరఖాస్తు తీసుకోవడం లేదు. నాలుగేళ్లు వేచి చూసినా ఫలితం లేదు' అంటూ వృద్ధులు వాపోతున్నారు. కొత్త పెన్షన్ల మంజూరు ప్రక్రియపై ప్రభుత్వం ఇటీవల పచ్చజెండా ఊపడంతో రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వర్గాల్లో ఆశలు పెరిగాయి. కొత్తగా రెండు లక్షల పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వర్గాలు తమకు అవకాశం లభిస్తుందని ఆశించారు. అయితే దరఖాస్తుల స్వీకరణలో కేటగిరీల మధ్య కనిపిస్తున్న వ్యత్యాసం ఇప్పుడు ప్రశ్నలను లేవనెత్తుతోంది. ముఖ్యంగా వృద్ధాప్య పింఛన్ కోసం అర్హత సాధించిన వారు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోవడమే ప్రధానంగా మారింది.

**వయసు మీద పడుతున్నా..**

వృద్ధాప్యంలో కూలి పనులు చేయలేని పరిస్థితి. ఒకవైపు పెరుగుతున్న నిత్యావసరాల ధరలు.. మరోవైపు వైద్య ఖర్చులు.. ఇంకోవైపు పిల్లలపై ఆధారపడాల్సిన దుస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం అందించే నెలవారీ పింఛన్ వృద్ధులకు చిన్నపాటి ఆర్థిక సాయమే అయినా.. వారి జీవితాల్లో అది కీలకమైన భరోసా. అందుకే అర్హత వయసుకు చేరిన వెంటనే పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వృద్ధులు ఆసక్తి చూపుతున్నారు.కానీ అర్హత ఉన్నప్పటికీ దరఖాస్తు స్వీకరణకు అవకాశం లేకపోవడంతో వారి పరిస్థితి .వయసు పెరిగింది.. ఆదాయం పెరగలేదు.. పింఛన్ మాత్రం రాలేదు' అన్నట్లుగా మారింది. గ్రామాల్లో పలువురు వృద్ధులు ఇప్పటికే పంచాయతీ కార్యాలయాలు, మీసేవ కేంద్రాలు, సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నా స్పష్టమైన సమాధానం దొరకడం లేదని వాపోతున్నారు.

**నాలుగేళ్లుగా ఎదురుచూపులే..**

కొత్త పింఛన్ల మంజూరులో ఏర్పడిన విరామంతో అర్హత వయసుకు చేరిన అనేకమంది వృద్ధులు సంవత్సరాలుగా దరఖాస్తు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. నాలుగేళ్లుగా కొత్త పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూసిన వారికి తాజాగా ప్రభుత్వం కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని ప్రకటించడం ఊరటనిచ్చింది. దీంతో తమ పేరు కూడా లబ్ధిదారుల జాబితాలో చేరుతుందని ఆశించారు. తీరా దరఖాస్తుల స్వీకరణలోనే తమ కేటగిరీకి చోటు లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ప్రకటన వచ్చింది.. ఆశలు పెరిగాయి.. దరఖాస్తు గడప దగ్గరే ఆగిపోయాయి అన్నట్లుగా పరిస్థితి తయారైందని పలువురు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నాలుగేళ్లుగా పింఛన్ కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పుడు కొత్త పెన్షన్లు ఇస్తామని ప్రకటించారు. మాకు దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా ఇవ్వకపోతే.. మళ్లీ ఎన్ని సంవత్సరాలు వేచి చూడాలి? అంటూ వృద్ధులు ప్రశ్నిస్తున్నారు. వృద్ధాప్యంలో ఉన్న వారికి పింఛన్ అనేది కేవలం నగదు సాయం కాదు.. ఆత్మగౌరవానికి, స్వతంత్ర జీవనానికి, కనీస భద్రతకు ఆసరా. అలాంటి పథకంలో అర్హులైన వృద్ధుల దరఖాస్తులకే అవకాశం లేకపోతే 'చేయూత' లక్ష్యం నెరవేరుతుందా? అన్నది ప్రభుత్వం ఆలోచించాల్సిన అంశం. ఊరించి.. ఉసూరుమనిపించకుండా.. కొత్త పెన్షన్ల ప్రక్రియలో వృద్ధాప్య కేటగిరీకి కూడా దరఖాస్తుల స్వీకరణకు తక్షణమే అవకాశం కల్పించి, నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులకు న్యాయం చేయాలని వృద్ధులు కోరుతున్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చ మనడం నేరమా..?

**భద్రాద్రి న్యూస్ చర్ల**



కాంగ్రెసు ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజల కోసం పోరాటాలు చేస్తే అరెస్టులు సస్పెన్షన్లు కుల రాజకీయాలు చేసి ప్రజలను పక్క దారి పట్టిస్తున్నారు అని బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు కో కన్వీనర్ ఐనవోలు పవన్ ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెసు ప్రభుత్వం 6 గ్యారంటీలు 420 హామీలు 100 రోజుల్లో నెరవేర్చుతాముఅని చెప్పి 1000 రోజులు అయిన అమలు చేయడం లేదు వెంటనే అమలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ ప్రజల కోసం నల్ల చొక్కాలతో నిరసన తెలుపుతూ అసెంబ్లీకి వెళ్ళుతున్నా ఎమ్మెల్యేలను ఎంఎల్సిలను అసెంబ్లీలోకి శాసన సభ సభ్యులను వెళ్ళనీయకుండా అడ్డుకొని  పోలీసులతో కొట్టించడం మహిళలని చూడ కుండా చీరలు లాగడం ప్రజాస్వామ్యాని తుంగలో తొక్కి వీటి అన్నీటిని పక్క దారి పట్టించుటకు కుల రాజకీయాలు చేయడం తెలంగాణ రాష్ట్రం సాధించి దళితుల కోసం దళిత బంధు 10 లక్షలు ఇచ్చిన కెసిఆర్ మీదకి దళితులను పంపించడం ఎంతటి అన్యాయం కొంత మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కెసిఆర్ చావును కోరుకోవడం  తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ఎటుపోతుంది గిరిజనుల కోసం 4 లక్షల 50 వేల ఎకరాల పోడు భూములకు లక్ష 50 వేల గిరిజనులకు పోడు భూములకు పట్టాలు మంజూరు చేశారు కెసిఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం 3 సంవత్సరాల అయిన గిరిజనులకు చేసింది ఏమి లేదు బీసీలకు లక్ష రూపాయలు బీసీ బంధు యాదవులకు జాలర్లకు రజకులకు పద్మశాలీలకు రాష్ట్రంలో కులాల వారిగా కూడా జీవనోపాధి కలిపించాడు కెసిఆర్ జూన్ 2 న ఇందిరమ్మ ఇళ్లు లక్ష 50 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు గతంలో ఇచ్చిన ఇళ్లకు ఇంత వరకు లాస్ట్ ఫేమెంట్ లక్ష 60 వేలు లేవు ఆగష్టు 15 న వికలాంగులకు వితంతువులకు ఒంటరి మహిళలకు ఫెన్షన్లు ఎటు పోయాయి 60 సంవత్సరాలు నిండిన ముసలి వాళ్ల పెన్షన్లు వస్తాయని ఎదురు చూస్తున్నారు వారి ఆశ అందని ద్రాక్ష పండ్లులా ఉంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవు ఉద్యోగులకు పిఆర్సీ లేదు డిఏ లు లేవు మహిళలకు తులం బంగారం లేదు 500 లకు గ్యాస్ లేదు ప్రతీ మహిళకు 2500 రూ లేవు రైతు కూలీలకు 12 వేలు ప్రతీ ఆటోడ్రైవలకు 12 వేలు లేవు కెటిఆర్ కిట్టు రైతు భీమా కళ్యాణ్ లక్ష్మి షాదిముబారాక్ పధకాలు అపేసారు ప్రజల గురించి కాని రాష్ట్ర అభివృద్ధి గురించి ఆలోచన చేయకుండా స్వంత పార్టీ గొడవలతో కాలక్షేపం చేస్తున్నారు ప్రజల సమస్యల పై బిఆర్ఎస్ పార్టీ 7 రోజుల పోరాటం ప్రజల్లో చైతన్యం వచ్చింది బిఆర్ఎస్ పార్టీ ప్రజల తరుపున హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాము నిరంతరం ప్రజల కోసం పోరాటాలు చేస్తాము

# రెజెనెన్స్ పాఠశాలలో వినాయక చవితి పండుగ వేడుకలు

**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 12 (భద్రాద్రి న్యూస్):-**

సకలాభీష్ట ప్రదాత అయిన వినాయకుని పుట్టిన రోజు వేడుక వినాయక చవితిని స్థానిక వి.డి.వోస్ కాలనీ లోని రెజొనెన్స్ స్కూల్ చిన్నారులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తమ చిన్ని చిన్ని చేతులతో వినాయక ప్రతిమలను తయారు చేసి ఆ విగ్రహాలతోనే పూజలు చేశారు. వినాయకుడికి యిష్టమైన కుడుములు, ఉండ్రాళ్ళు, పాయసం, పూలు, పండ్లు తెచ్చి వినాయకుణ్ణి అలంకరించి పూజలు జరిపించారు. "రంగు విగ్రహాలు వద్దు. మట్టి విగ్రహాలనే పూజిద్దాం కాలుష్యాన్ని నివారించి పర్యావరణం కాపాడుదాం." అనే నినాదంతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గణాలకు అధిపతి, శబ్దాలకు జ్యేష్ట రాజు, ప్రణవ స్వరూపుడు అయిన వినాయకుడిని పూజించవలసిన అవసరాన్ని, పండుగ ప్రాముఖ్యతను పాఠశాల డైరెక్టర్ శ్రీమతి నీలిమగారు వివరించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు, ఆశీస్సులు తెలియజేశారు. పర్యావరణాన్ని కాపాడటం మన అందరి బాధ్యత అని మట్టి గణపతినే పూజించాలని, సాంప్రదాయాలు మరుగున పడిపోతున్న ఈ రోజుల్లో తమ



పాఠశాల విద్యార్థులు ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమనీ, మన సంస్కృతి సాంప్రదాయాలు కాపాడటానికి విద్యార్థులకు ఇలాంటి వేడుకలు నిర్వహించడం ఎంతో ముఖ్యమనీ రెజొనెన్స్ డైరెక్టర్స్ శ్రీమతి నీలిమ, ఆర్.వి. నాగేంద్రకుమార్, శ్రీ కె. శ్రీధర్రావ్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# స్మార్ట్ కిడ్జ్ లో వేడుకగా గణేష్ చతుర్థి సంబురాలు

**మట్టి గణపతులనే పూజించాలని చైతన్య ర్యాలీ**

**చిట్టి చేతులతో మట్టి గణపయ్యల తయారీ**



**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 12 (భద్రాద్రి న్యూస్):-**

స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం గణేష్ చతుర్థి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. పాఠశాల చిన్నారులు తమ చిట్టి చేతులతో మట్టి గణపయ్యలకు రూపం ఇచ్చి మట్టి గణపతిని పూజించాలనే సందేశాన్ని అందించారు. మట్టి గణపయ్యలతో నగరంలో పాఠశాల చిన్నారులు చైతన్య ర్యాలీ నిర్వహించారు.మట్టి గణపతులను పూజించాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని, ఎకో ఫ్రెండ్లీ గణపయ్యలతో పూజించడం ద్వారా కాలుష్యాన్ని దూరం చేయవచ్చు అని తెలియజేస్తూ నిర్వహించిన అవగాహన ర్యాలీ నగర ప్రజలను ఆకట్టుకున్నది. పూలతో, పిండితో, పలురకాల ఆకులతో, పండ్లు, వివిధ రకాల కూరగాయలు, దినుసులతో వినాయక ఆకృతులలో ప్రతిమలను తయారు చేశారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ మాతృ వాక్య పరిపాలన కోసం వినాయకుడు నిరంతరం మాతృ ప్రేమను చాటి చెప్పారని తెలిపారు. ఎకో ఫ్రెండ్లీగా మట్టి గణపయ్యలను పూజించాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయానిక రంగులతో రూపొందించిన వినాయకులను పూజించడం ద్వారా జల కాలుష్యం,వాయు కాలుష్యం, వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపయ్యల విగ్రహాలను పూజించాలని కోరారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి ఎకో ఫ్రెండ్లీ గణపతిని పూజించాలని విద్యార్థులలో అవగాహన పెంచేందుకు తమ పాఠశాలలో విద్యార్థులతోనే పలు రకాల మట్టి వినాయకులను తయారు చేసే కార్యక్రమంతో అవగాహన కల్పించామని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాలు సామూహికంగా  ప్రజలలో చైతన్యాన్ని, సహకార భావనను, మైత్రి బంధాన్ని  పెంపొందిస్తున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య,ప్రిన్సిపల్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# త్రివేణి పాఠశాలలో వైభవంగా ముందస్తు వినాయక వేడుకలు

**ఎకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణకు పిలుపు**



**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 12 (భద్రాద్రి న్యూస్):-**

భక్తి, సంప్రదాయం, పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని చాటుతూ త్రివేణి పాఠశాలలో ముందస్తు వినాయక వేడుకలను ఘనంగా నిర్వహించారు. పర్యావరణహిత వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ విద్యార్థులు పూలు, పండ్లు, సహజసిద్ధమైన వస్తువులతో ఎకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహాలను తీసుకువచ్చి ప్రదర్శించారు.

ఈ సందర్భంగా ప్రత్యేకంగా వినాయక పూజ నిర్వహించి, విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ఉత్సాహభరిత నృత్యాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉపాధ్యాయులు ఆలపించిన భక్తిగీతాలు కార్యక్రమానికి ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ.. "వినాయక చవితి వంటి పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు పరిచయం చేయడంతో పాటు ప్రకృతి పట్ల బాధ్యతను నేర్పించే గొప్ప అవకాశాలు. ఎకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహాల వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో చైతన్యం కలిగించడం అభినందనీయం" అని అన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. "వినాయకుడి రూపంలోని ప్రతి అవయవం మనకు ఒక గొప్ప జీవిత సందేశాన్ని అందిస్తుంది. పెద్ద తల విశాలమైన ఆలోచనలకు ప్రతీక. పెద్ద చెవులు ఎక్కువగా వినాలని, చిన్న కళ్ళు ఏకాగ్రతతో విషయాలను గమనించాలని సూచిస్తాయి. తొండం పరిస్థితులకు అనుగుణంగా ఆలోచించే, అవసరానికి తగ్గట్టు వ్యవహరించే సామర్థ్యాన్ని తెలియజేస్తుంది. వినాయకుడి రూపంలోని ఈ విలువలను విద్యార్థులు తమ జీవితంలో ఆచరించాలి. అదే సమయంలో పర్యావరణహితంగా పండుగలను జరుపుకోవడం ద్వారా ప్రకృతిని కాపాడే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ గుర్తించాలి" అని తెలిపారు. భక్తి, సంస్కృతి, కళల సందడితో సాగిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. "మట్టి వినాయకుడు -- మన ప్రకృతికి మేలు" అనే సందేశంతో పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు సమాజానికి దిక్సూచీలు





**నల్గొండ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవి**
**యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం**

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 12 (భద్రాద్రి న్యూస్):**
ఉపాధ్యాయులు సమాజానికి దిక్సూచీ లాంటి వారని, వారి దిశా నిర్దేశంలో విద్యార్థులు తమ ప్రతిభకు పదునుపెట్టి ఉన్నతులుగా ఎదుగుతారని నల్గొండ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రమాదేవి అన్నారు. యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు జె.బి. బాలు ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి వారికి అవార్డులను ప్రదానం చేశారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని 24 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ముఖ్య అతిధులు డిప్యూటీ కలెక్టర్ రమాదేవి, భద్రాచలం మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్, టీజీఓ జిల్లా అధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య చేతులమీదుగా అవార్డులు అందచేసి సత్కరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే అంశాలు భవిష్యత్తుకు భరోసా కల్పిస్తాయన్నారు. ప్రతీ విద్యార్థి ఉపాధ్యాయులకు ముఖ్యమేనని చెప్పారు. ఎంతోమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ బాల్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం చేశారని గుర్తుచేశారు. ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, పాఠశాలలు దేవాలయాలు అయితే అందులో ఉపాధ్యాయులు దేవుళ్లతో సమానమని అభివర్ణించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిపై మరింత బాధ్యత పెరుగుతుందని అన్నారు. జిల్లా ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రంగా ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులంటే సమాజంలో ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు తమ తరగతిగదిలోని ప్రతి విద్యార్థికి విలువలతో కూడిన విద్యను అందిస్తారని చెప్పారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎం.రమ (పాల్వంచ), బి.బాలాజి (చుంచుపల్లి), వి.రాజశ్రీనివాసరావు (భద్రాచలం), సోయం కృష్ణ (దుమ్ముగూడెం), ఎన్.శ్రీనివాస్ (పాల్వంచ), టి.వనజ (అశ్వాపురం), షాబీర్‌బాషా (పినపాక), వి.వి. కోటేశ్వరరావు (మణుగూరు), బి.రమేష్ రాథోడ్ (ములకలపల్లి), బి.బాబూరావు (బూర్గంపాడు), ఎం.రూపావినయ్ (చర్ల), టి.శ్రీరాములు (చంద్రుగొండ), జి.మోహన్‌లాల్ (లక్ష్మీదేవిపల్లి), పి.సుధశ్రీ (పాల్వంచ), ఎం.రాజయ్య (చుంచుపల్లి), వి.దస్రు (ములకలపల్లి), బి.రాము (చుంచుపల్లి), ఆర్.నాగజ్యోతి (జూలూరుపాడు), ఎన్.కిరణ్ కుమార్ (చంద్రుగొండ), బి.సుజాత (సుజాతనగర్), ఎస్.రాజశేఖర్ (పాల్వంచ), ఎస్.కె.నజియా (చుంచుపల్లి), ఎం.పుష్పలత (ఇల్లందు), . నాగమణి (దమ్మపేట) లకు అవార్డులు అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ గౌరవ జిల్లా అధ్యక్షులు బి. వీరు నాయక్, ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు సాయి క్రిష్ణ, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి,రత్నాకర్, హనుమాన్ జిమ్ కమలాకర్, జుబ్బు, మొక్కల బాలు, రాజేష్, రంగ, సుభాని, జయశ్రీ, వర ప్రసాద్, బాలకృష్ణ ,నాగ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణే మనందరి బాధ్యత

**సింగరేణి ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ**







**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 12 (భద్రాద్రి న్యూస్):–**
పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో శనివారం ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సి.హెచ్. వెంకటరమణ హాజరై ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని జీఎం పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలగకుండా వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ జే. గట్టయ్య, ఐఎన్‌టీయూసీ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్, ఎస్ఓటూ జీఎం ఎం. గోవిందరావు, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, జీఎం కార్యాలయ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ మున్నూరు కాపు జేఏసీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా యర్రా అప్పారావు నియామకం



**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 12 (భద్రాద్రి న్యూస్):–**
తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు జాయింట్ యాక్షన్ కమిటీ ఖమ్మం జిల్లా నూతన అధ్యక్షుడిగా యర్రా అప్పారావు ఏకగ్రీవంగా నియమితులయ్యారు . ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్దన్ నియామక ఉత్తర్వులు ప్రకటించారు . జిల్లా అధ్యక్షుడిగా యర్రా అప్పారావును ఏకగ్రీవంగా ఎంపిక చేయడం పట్ల మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు , ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు . ఆయన నాయకత్వంలో ఖమ్మం జిల్లాలో మున్నూరు కాపు జేఏసీని మరింత బలోపేతం చేసేందుకు కృషి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు . అదే విధంగా సామాజిక వర్గ ఐక్యత , సంక్షేమం , హక్కుల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఆధ్వర్యంలో మరింత విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు . జిల్లాలోని మున్నూరు కాపు సమాజాన్ని సంఘటితం చేస్తూ... వారి సమస్యలను సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లడంలో నూతన జిల్లా అధ్యక్షుడు కీలకంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు . ఈ సందర్భంగా యర్రా అప్పారావుకు పలువురు నాయకులు , అభిమానులు , మున్నూరు కాపు జేఏసీ ప్రతినిధులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు . తనను ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నియమించిన తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్దన్ కు యర్రా అప్పారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జిల్లాలో జేఏసీని మరింత బలోపేతం చేయడానికి , మున్నూరు కాపు సామాజిక వర్గం అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు .

## మట్టి వినాయకుడితో పర్యావరణ పరిరక్షణకు 'హార్వెస్ట్' విద్యార్థుల పిలుపు

**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 12 (భద్రాద్రి న్యూస్):–**
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్లో విద్యార్థులు పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను స్వయంగా తయారు చేశారు. సంప్రదాయ భక్తిని పర్యావరణ పరిరక్షణతో మేళవిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించింది. విద్యార్థులు మట్టిని ఉపయోగించి వివిధ ఆకృతుల్లో వినాయక విగ్రహాలను ఎంతో ఆసక్తిగా రూపొందించారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, "మట్టి వినాయకుడు – పర్యావరణానికి మేలు" అనే సందేశాన్ని సమాజానికి అందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి. రవి మారుత్ మాట్లాడుతూ. భారతీయ సంస్కృతిలో వినాయక చవితికి ఎంతో విశిష్టమైన స్థానం ఉందని, పండుగల అసలు స్ఫూర్తి ప్రకృతిని గౌరవించడంలోనే ఉందని అన్నారు. విద్యార్థులు చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణ విలువలను అలవర్చుకోవడం భవిష్యత్ సమాజానికి ఎంతో అవసరమని . వినాయకుడిని మట్టితో తయారు చేయడం కేవలం ఒక కళా కార్యక్రమం కాదు; ఇది మన సంస్కృతిని, ప్రకృతిని, భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యతను గుర్తుచేసే గొప్ప సందేశం. మట్టితో చేసిన వినాయక విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోతాయి. అందువల్ల సంప్రదాయాన్ని కాపాడుతూనే



పర్యావరణాన్ని పరిరక్షించే మార్గాన్ని మన పిల్లలు చూపించడం అభినందనీయం అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. పార్వతి రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించడమే ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని, పుస్తకాలలో నేర్చుకునే జ్ఞానం జీవితంలో ఆచరణలోకి వచ్చినప్పుడే నిజమైన విద్య అవుతుంది. మట్టి వినాయక విగ్రహాల తయారీ ద్వారా మా విద్యార్థులు కళను నేర్చుకోవడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ, నీటి కాలుష్య నివారణ, ప్రకృతి పట్ల బాధ్యత వంటి విలువలను కూడా అర్థం చేసుకున్నారు. ప్రతి విద్యార్థి 'నా పండుగ 'నా బాధ్యత' అనే ఆలోచనతో ప్రకృతిని కాపాడుతూ పండుగను జరుపుకుందాం అన్నారు. ఈ మట్టి విగ్రహాల తయారీలో తమ పాఠశాల సి.సి.ఏ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయుల పాత్ర. అభినందనీయమన్నారు.

## వికసిత్ భారత్‌లో విద్యార్థులు భాగస్వాములు కావాలి

**(భద్రాద్రి న్యూస్):–**
విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వికసిత్ భారత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుంకరి జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్య సాధనలో యువత, ముఖ్యంగా విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని ఆమె అన్నారు.వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి విద్యార్థి తన వంతు బాధ్యతను గుర్తించి, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, శ్రీలత, చందర్, రమేష్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## భక్తుల కోసం 'వినాయక వ్రతకల్పం' పుస్తక ఆవిష్కరణ



**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 12 (భద్రాద్రి న్యూస్):-**
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ వ్యాపారవేత్త, ఖమ్మం క్లాత్ అండ్ రెడీమేడ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, గెల్లా గ్రాండ్ అధినేత గెల్లా రవి భక్తుల కోసం ప్రత్యేకంగా ముద్రించిన 'శ్రీ వినాయక వ్రతకల్పం' పుస్తకాన్ని గెల్లా గ్రాండ్‌లో ఆవిష్కరించారు. వినాయక పూజా విధానం ప్రతి భక్తుడికి సులభంగా అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని ముద్రించినట్లు తెలిపారు. గెల్లా రవి మాట్లాడుతూ హిందువుల పండుగల్లో వినాయక చవితికి విశిష్ట స్థానం ఉందన్నారు. భాద్రపద శుద్ధ చవితి రోజున విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించడం ద్వారా జీవితంలోని విఘ్నాలు తొలగిపోవాలని కోరుకుంటారని తెలిపారు. సంప్రదాయబద్ధమైన పూజా విధానాన్ని అందరికీ అందించాలనే ఉద్దేశంతో పుస్తకాన్ని భక్తులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, ప్రముఖ వ్యాపారవేత్త కల్వకుంట్ల గోపాల్, సీనియర్ జర్నలిస్ట్, వాసవి జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక సభ్యులు టీఎస్ చక్రవర్తి మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా భక్తులకు ఉపయోగపడే పూజా విధానాన్ని పుస్తక రూపంలో అందించడం అభినందనీయమన్నారు. గెల్లా రవి సేవాభావంతో, సాదాసీదాగా ఉంటూ సమాజంలోని అన్ని వర్గాలతో కలిసిమెలిసి ఉంటారని కొనియాడారు. కార్యక్రమంలో పులిపాటి వాసవి నగర్ అధ్యక్షులు కొదుమూరి భద్రయ్య, తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య రాష్ట్ర అధ్యక్షులు సిద్ధంశెట్టి శ్రీకాంత్, జిల్లా ఆర్య వైశ్య సభ నాయకులు బూర్లే పుల్లారావు, వ్యాపారవేత్తలు గెల్లా శ్రావణ్, గెల్లా సుజన్ కుమార్, వందనపు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ప్రచార దినాలను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి

**అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి**
**ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి**





**భద్రాద్రి న్యూస్ ములుగు**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినాలను అర్హులైన ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి సూచించారు. శనివారం ములుగు, మల్లంపల్లి, వెంకటాపురం మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల నమోదు అధికారి తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారుల అందుబాటు, ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులు, క్లెయిమ్స్, అభ్యంతరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడంతోపాటు ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా బూత్ స్థాయి అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం--6, పేర్ల తొలగింపునకు ఫారం--7, వివరాల సవరణకు ఫారం--8 దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. ఓటర్ల నుంచి అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. ప్రత్యేక ప్రచార దినాల్లో బూత్ స్థాయి అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ములుగు తహసీల్దార్ ఎన్. విజయభాస్కర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నగేష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, రాజేందర్, జూనియర్ అసిస్టెంట్ సాత్విక్, బూత్ స్థాయి అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిన్ను నువ్వు మార్చుకుంటే... ప్రపంచాన్నే మార్చగలవు

**సర్వజ్ఞ ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆకెళ్ల రాఘవేంద్ర**



**ఖమ్మం(భద్రాద్రి న్యూస్):**
ఖమ్మంలోని సర్వజ్ఞ జూనియర్ కళాశాల ( ఐఐటి, జేఈఈ ,నీట్ అకాడమీ ) ఆధ్వర్యంలో నూతనంగా చేరిన జూనియర్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన "తరంగ్--2026" ఫ్రెషర్స్ పార్టీ వేడుకలు స్థానిక భ్రమరాంబ గ్రాండ్ ఏ/సీ కన్వెన్షన్ హాల్లో శనివారం అత్యంత ఉత్సాహభరితంగా, వైభవంగా జరిగాయి. కళాశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ, సర్వజ్ఞ విద్యా సంస్థల ముఖ్య ఉద్దేశం విద్యార్థులను కేవలం పరీక్షలకు సిద్ధం చేయడం మాత్రమే కాకుండా, సమాజంలో ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడమేనని తెలిపారు. అకాడమిక్స్‌తో పాటు విద్యార్థుల ఆల్‌రౌండ్ ప్రతిభకు తమ కళాశాల ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. కళాశాల డైరెక్టర్ కె. నీలిమ మాట్లాడుతూ, అనుభవజ్ఞులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఐఐటి, జేఈఈ ,నీట్ లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధమైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. కొత్తగా చేరిన జూనియర్ విద్యార్థులు తమ సీనియర్ల స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఇది నీ లైఫ్... నీకు నచ్చినట్లు బ్రతుకు. నీలో హీరోని నిద్రలేపు. నిన్ను తిట్టినోడే తిరిగి గౌరవించేలా చేయి. ఇతరులతో పోల్చుకునే వాడు ఎప్పటికీ హ్యాపీగా ఉండలేడు!" అని అన్నారు. గురువుల ప్రాముఖ్యతను వివరిస్తూ, "పాఠాలు చెప్పడమే కాదు... లక్ష్యాన్ని నిర్దేశించి, క్రమశిక్షణను పెంపొందించి, ఆత్మవిశ్వాసాన్ని నింపి, ఆశయాలకు ఆకారాన్ని ఇచ్చే వారే గురువులు" అని పేర్కొన్నారు. అలాంటి గురువులను కలిగి ఉన్న సర్వజ్ఞ విద్యార్థులు అదృష్టవంతులని అన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ప్రముఖ కవి, ఎఫ్ ఈ ఎంఏ కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు మాట్లాడుతూ, "నువ్వు జీవితంలో ఎదగాలంటే, నిన్ను నువ్వే మోటివేట్ చేసుకోవాలి" అని అన్నారు. "నాకు కొంచెం నమ్మకం ఇవ్వు... ఈ ప్రపంచాన్నే జయిస్తా!" అంటూ, విద్యార్థులు ఏదైనా సాధించాలంటే ముందుగా తమపై తమకు నమ్మకం ఉండాలని తెలిపారు. ఈ వేడుకల్లో విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు, సంగీత కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యా, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఆర్ వి . నాగేంద్ర కుమార్ , డైరెక్టర్ కె. నీలిమ , డీన్ జనార్ధన్ , ప్రిన్సిపాల్ లక్ష్మణరావు , అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రాజీ మార్గమే రాజ మార్గం..

**రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో రాజీ పడవచ్చు..**

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నాగరాజు**

**జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ లో 3 వ జాతీయ లోక్ అదాలత్ ను ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి**




**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 12 (భద్రాద్రి న్యూస్):-**
రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి, సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు తెలుపారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఖమ్మం న్యాయ సేవా సదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో 15 లోక్ అదాలత్ బెంచ్‌ల ఏర్పాటు చేసినట్లు, ఇందులో ఖమ్మం హెడ్ క్వార్టర్ లో 9, సత్తుపల్లిలో 3, మధిరలో 3 బెంచ్ లు ఉన్నాయని అన్నారు. ప్రజలకు వేగంగా, సమర్ధవంతంగా న్యాయం అందించేందుకు వీటిని ఏర్పాటుచేశామన్నారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ/వైవాహిక వివాదాలు, ప్రీ-లిటిగేషన్ కేసులు, వినియోగదారుల వివాదాలు, రాజీపడదగ్గ కేసులన్నీ లోక్ అదాలత్ లో పరిష్కారం అవుతాయన్నారు. ప్రాచీన కాలం నుంచే మన సంస్కృతిలో సామరస్య పరిష్కార వ్యవస్థలు ఉన్నాయని, లోక్ అదాలత్ అనేది వివాదాలను త్వరగా, తక్కువ ఖర్చుతో ముగించే సరళమైన మార్గమని తెలిపారు. కోర్టు ఫీజులు చెల్లించి ఉంటే వాటిని సంబంధిత పక్షాలకు తిరిగి చెల్లిస్తారని, లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత కలిగి ఉంటుందని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, ధనం ఆదా అవుతుందని, కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా, కక్షలు-కార్పణ్యాలు లేకుండా రెండు పక్షాలకూ విన్-విన్ ఫలితం లభిస్తుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.

ఇరుపక్షాల అంగీకారంతో తీర్పు వెలువడటం వల్ల మళ్లీ ఉన్నత కోర్టుల్లో అప్పీలు చేసుకునే అవసరం ఉండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ అన్నారు. గతంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో ఖమ్మం జిల్లా న్యాయశాఖ, పోలీసు విభాగం, న్యాయవాదుల సహకారంతో తెలంగాణ రాష్ట్రంలోనే 5వ ర్యాంకు సాధించిందని గుర్తుచేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ వంటి మెట్రోపాలిటన్ ప్రాంతాలతో పోటీపడి ఈ స్థాయిని సాధించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, సమాజంలో వివాదాలను పరస్పర అవగాహన, ఒప్పందాల ద్వారా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ అత్యంత ప్రాముఖ్యమైన వేదిక అని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల బాధితులకు, వివాదంలో ఉన్న ఇరువర్గాలకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. చిన్న చిన్న వివాదాలను ఇరుపక్షాలు కూర్చుని మాట్లాడుకోవడం వల్ల న్యాయస్థానాలపై కేసుల భారం తగ్గుతుందని తెలిపారు. పోలీసు శాఖ, బార్ కౌన్సిల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయధికారులు సమన్వయంతో పనిచేసి లోక్ అదాలత్ ద్వారా గరిష్ట సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని అన్నారు. గత లోక్ అదాలత్‌లో దాదాపు 5,800 కేసులు పరిష్కారం కాగా, ప్రస్తుతం 7,800 కేసులు సిద్ధంగా ఉన్నాయని, ఈ సంఖ్యను 10,000 దాటించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ వివాదాలను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ లో పరిష్కారం అయిన కేసులకు సంబంధించి చెక్కులను ప్రధాన న్యాయమూర్తి అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కోర్ట్ న్యాయమూర్తి వీ. శీనయ్య, ఎస్సీ, ఎస్టీ కోర్ట్ న్యాయమూర్తి పి.పి. కృష్ణార్జున్, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి మహేష్ నాథ్, బార్ కౌన్సిల్ సభ్యులు ఎం. శ్రీనివాస రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యడ్లపల్లి రమేష్, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి దేవీ మానస, న్యాయమూర్తులు కల్పన, శివరంజని, మురళీమోహన్, జ్యోతిర్మయి, రజని, బిందుప్రియ, ప్రవీణ్, నాగలక్ష్మి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్యానెల్ అడ్వకేట్లు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకింగ్/ఇన్సూరెన్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.